TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు  తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

సంపుటి : 01 సంచిక : 290 | గురువారం జూన్ 26 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

**విలేఖరులు కావలెను...**


మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

## అదనపు కలెక్టర్లు వారంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు సందర్శించాలి సీఎం రేవంత్ ఆదేశం

- అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులను పర్యవేక్షించాలని సీఎం సూచించారు.
- ప్రభుత్వ బడుల్లో పెరుగుతున్న ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 48 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

2లో



## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు

- విజయవాడ కేంద్రంగా ఈ కార్పొరేషన్ పనిచేస్తుంది.
- వరద జలాల నిర్వహణ, పోలవరం-బనకచర్ల నిర్మాణం, ఇతర ప్రాజెక్టుల పూర్తి దీని లక్ష్యాలు.
- అన్ని అధ్యయనాలు చేశాకే కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు జీవోలో ఉంది.
- బనకచర్ల అక్రమమని, నీటిని వదులుకోమని తెలంగాణ అంటున్న నేపథ్యంలో ఏపీ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది.

ఒకవైపు బనకచర్లపై తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తూ ఎలాగైనా అడ్డుకోవాలని ప్రయత్నిస్తుంటే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టు నిర్మాణం కోసం కొత్తగా ఒక ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

2లో




## హైదరాబాద్‌లో బోనాలు..

### నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం



2లో

హైదరాబాద్: జంటనగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2,783 ఆలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణ కోసం నిధులను చెక్కుల రూపంలో జారీ చేసిందన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి టోనీ బ్లెయిర్ లేఖ.. తెలంగాణ రైజింగ్ 2047కు ప్రశంస

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ రాశారు. తెలంగాణ రైజింగ్-2047ను ప్రశంసించారు. ఇటీవల దిల్లీ పర్యటన సందర్భంగా టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రైజింగ్ విజన్ 2047గురించి ఆయనకు వివరించిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఐటీ, ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో లక్ష్యాల గురించి ఆయనతో చర్చించారు. ఈ నేపథ్యంలో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్, తెలంగాణ మధ్య అవగాహన ఒప్పందం కుదరగా.. రైజింగ్ విజన్ రూపకల్పన, అమలుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఇరువైపుల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ 2047 తనను ఆకట్టుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించిన టోనీ బ్లెయిర్.. ఈ విజన్‌కు సహకరిస్తామని తెలిపారు.



2లో

## మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదు:



## హైకోర్టు తీర్పు మేరకు స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- ఇంతకాలం ఎన్నికలు దాటవేయడం సరికాదు
- బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్ డిమాండ్



తెలంగాణ హైకోర్టు తీర్పు మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను రేవంత్ ప్రభుత్వం నిర్వహించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30వ తేదీలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టకుండా రేవంత్ సర్కార్ చోద్యం చూస్తోందని విమర్శించారు. బుధవారం ఢిల్లీ వేదికగా మీడియాతో బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడారు. సర్పంచ్‌ల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేశారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ గుర్తుచేశారు.

మిగతాది 2లో

# ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై సంచలన నిర్ణయం




మిగతాది 2లో

- ఏపీ,తెలంగాణ మధ్య వివాదంగా మారిన బనకచర్ల ప్రాజెక్ట్ పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.
- గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్ ను ఆపడానికి చట్టపరంగా ముందుకెళ్తామని ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.
- బనకచర్లతో తెలంగాణకు నష్టమన్న ఉత్తమ్.. తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించేందుకు న్యాయపోరాటానికి సంబంధించి రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ప్రేమ వ్యవహారానికి అడ్డొస్తుందనే అంజలి హత్య.. కుమార్తె సహా ముగ్గురి అరెస్ట్



2లో..

- జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన అంజలి హత్య కేసును 24 గంటల్లో ఛేదించామని బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు.

# సంపాదకీయం

## విశ్వవేదికపై భారత్ స్థానమేమిటి

'అరాచకత్వమే ప్రస్తుత వ్యవస్థగా కనిపిస్తోంది.. అలా అనిపించడం దారుణం కావచ్చు కాని అదే వాస్తవం..' అని ఆర్ఎస్ఎస్ మేధావి రాం మాధవ్ తన తాజా పుస్తకం 'ద న్యూ వరల్డ్ %-%ట్వంటీఫస్ట్ సెంచరీ గ్లోబల్ ఆర్డర్ అండ్ ఇండియా'లో చెప్పారు. ఈ పుస్తకాన్ని సోమవారం నాడు ఢిల్లీలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖడ్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ రాజకీయాలు అయోమయంగా, హింసాత్మకంగా ఉన్న సమయంలో రాంమాధవ్ పుస్తకానికి ప్రాధాన్యత లేకపోలేదు. 'భారతదేశం తన స్వంత బలం ద్వారా తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలి కాని పాశ్చాత్య ఆధిపత్య భావజాలానికి లోనుకావడం వల్లకాదు. అంతర్జాతీయ దేశాలన్నీ ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేసే బహుపక్ష వాదం క్షీణిస్తోంది. ఈ సమయంలో భారతదేశం ఊహాలోకంలో విహరించే బదులు తన ఆర్థిక ప్రగతిపై దృష్టి కేంద్రీకరించాలి..' అని రాంమాధవ్ చెప్పిన విషయాలను ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా ఉటంకించారు. అంతర్జాతీయ ఒత్తిడికి లోనై నెలరోజుల క్రితం భారత పాకిస్థాన్‌లు యుద్ధం అంచు నుంచి వెనక్కి మళ్లాయి. అయితే ప్రపంచంలో ఎక్కడా శాంతియుత వాతావరణం లేదు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య 2022 ఫిబ్రవరిలో మొదలైన యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. 2023 అక్టోబర్‌లో మొదలైన ఇజ్రాయిల్%-%హమాస్%-%హెజ్బుల్లా%-%హౌతీ%-%ఇరాన్ యుద్ధం ఇంకా ఆగలేదు. గాజాలో ఆహారం, సహాయం కోసం సరిహద్దుల్లో వేచి చూస్తున్న వందలాది పాలస్తీనీయులను ఇజ్రాయిల్ దళాలు మంగళవారం కాల్చి చంపుతున్నట్లు వార్తలు వచ్చాయి. ఇరాన్‌లో మూడు అణుస్థావరాలను ధ్వంసం చేసినట్లు అమెరికా ప్రకటించినప్పటికీ, ఇజ్రాయిల్%-%ఇరాన్ యుద్ధం ఎడతెరిపి లేకుండా సాగుతోంది.

గత మూడు దశాబ్దాలుగా ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో చైనా విస్తరణ కొనసాగుతూనే ఉన్నది. ఈ మొత్తం పరిణామాల్లో భారతదేశం పాత్ర ఏమిటి? అన్న విషయంలో అంతటా అయోమయం నెలకొని ఉన్నది. పహల్గామ్‌లో పర్యాటకులను కాల్చి చంపిన పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎండగట్టేందుకు భారత్ తన ప్రతినిధులను ప్రపంచ దేశాలకు పంపిన కొద్ది రోజుల్లోనే ఈ పరిణామాలు సంభవించాయి. మన ప్రతినిధులు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌ను కలిసిన వారం రోజుల్లోపే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైట్ హౌజ్‌లో విందు ఇచ్చారు. పహల్గామ్‌లో ఉగ్రవాద ఘటనకు సూత్రధారి మునీరే అని భారత్ నిందించినప్పటికీ అతడికి అమెరికా పెద్ద పీట వేసింది! పాక్ ఆర్మీ ఛీఫ్ ఒకరికి వైట్ హౌజ్‌లో విందు ఇచ్చి గౌరవించడం ఇదే మొదటిసారి. ఇరాన్‌పై దాడులు చేసేందుకు పాక్ భూభాగాలు అమెరికాకు అవసరం. అదే సమయంలో ఇరాన్%-%పాకిస్థాన్ సరిహద్దుల్లో క్రియాశీలంగా ఉన్న వేర్పాటువాద శక్తులను నియంత్రించడం ఇస్లామాబాద్‌కు అవసరం. ఇరు దేశాలు తమ పరస్పర ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకే ఈ సమావేశం జరిగిందని భారత రక్షణ, దౌత్య వ్యవహారాల నిపుణులు కొందరు వ్యాఖ్యానించారు. వేర్పాటువాదం పెచ్చరిల్లుతున్న బెలూచిస్తాన్‌లోని అత్యంత విలువైన ఖనిజవనరులను అమెరికాకు అప్పగించేందుకు ఫీల్డ్ మార్షల్ మునీర్ ఒప్పందం కుదుర్చుకున్నారని వార్తలు వచ్చాయి.. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న దాడులను పాకిస్థాన్ విజయవంతంగా తనకు అనుకూలంగా మలుచుకున్నదన్న విషయంలో సందేహం లేదు. ఇప్పటికే చైనాతో భవబంధాలు ఏర్పర్చుకుని బలమైన రక్షణ, ఆర్థిక సహకారాన్ని పొందుతున్న పాకిస్తాన్‌ను అమెరికా కూడా హత్తుకుంటోందన్న చేదు నిజం భారతీయులకు జీర్ణించుకోలేనిదిగా మారింది. భారత్‌కు అమెరికా అత్యంత సన్నిహిత దేశమన్న విషయంలో ఎవరికైనా భ్రమలు ఉంటే ఈ పరిణామాల తర్వాత అవి చెదిరిపోయాయనే భావించవచ్చు. విచిత్రమేమంటే భారతదేశంలో నేరాలు, ఉగ్రవాదం పెరిగిపోతున్నందువల్ల ఆ దేశంలో ఉన్న, పనిచేస్తున్న అమెరికన్ పౌరులు, ఉద్యోగులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, మహిళలు ఒంటరిగా ప్రయాణించకూడదని అమెరికా విదేశాంగ శాఖ తాజాగా తమ దేశస్తులకు హెచ్చరికలు పంపింది. భారతదేశంలో అత్యాచారాలు, నేరాలు పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా పర్యాటక ప్రదేశాల్లో హింసాత్మక ఘటనలు, లైంగిక దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. తన విధానాలకు అనుగుణంగా నడుచుకునేలా ఒత్తిడి చేసే క్రమంలోనే అమెరికా ఇలాంటి అడ్వైజరీలు జారీ చేస్తుందన్న విషయం సుస్పష్టం. ఈ పరిణామాల నేపథ్యంలో గత దశాబ్ద కాలంగా చైనాతో పాటు పొరుగు దేశాలన్నిటినీ విస్మరించి, వాటితో శత్రుత్వం కొని తెచ్చుకుని, అమెరికాకు స్నేహహస్తం చాచి, ఆ దేశ సారథ్యంలోని కూటముల్లో చేరి ఎనలేని ఆదరాభిమానాలు చూపిన భారతదేశం సాధించినదేమిటి? అన్న ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి అమెరికాకు ఆప్తమిత్ర దేశమైన ఇజ్రాయిల్ పాలస్తీనియన్ సంస్థ హమాస్‌పై దారుణంగా దాడులు చేస్తున్నప్పుడు భారత్ మౌనం పాటించింది. గాజాలో శాశ్వతంగా కాల్పులు విరమించాలని, ప్రజలను ఆకలితో మరణించేలా చేయడం సరైంది కాదని ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీలో జూన్ 12న చేసిన తీర్మానాన్ని అమెరికా, ఇజ్రాయిల్ తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ తీర్మానానికి అనుకూలంగా 149 దేశాలు ఓటు వేస్తే భారతదేశం ఓటు వేయకుండా తప్పుకొంది. రెండు రోజుల తర్వాత షాంఘై సహకార సంస్థ సమావేశంలో ఇరాన్ సైనిక స్థావరాలపైనే కాక, ప్రజల నివాసాలపై కూడా ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేసినప్పుడు కూడా భారతదేశం ఓటింగ్‌లో పాల్గొనకుండా తప్పుకుంది. ఇలా తప్పించుకున్న ఏకైక దక్షిణాసియా దేశం భారత్ మాత్రమే! తాజాగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి 45 నిమిషాలు మాట్లాడారు.

ఆ సందర్భంగా చర్చలు, దౌత్యనీతి ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని మోదీ సలహా ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఇరాన్‌పై అమెరికా దాడుల విషయంలో భారత్ ఒక స్పష్టమైన వైఖరి తీసుకోదలుచుకోలేదని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. పోఖ్రాన్ సమయంలో భారతదేశం ఎదుర్కొన్న పరిస్థితినే నేడు ఇరాన్ ఎదుర్కొంటోంది. నాడు భారత్‌కు అనేక దేశాలు అండగా నిలిచాయి. కాని ఇవాళ భారత్ ఒక స్పష్టమైన వైఖరి తీసుకునేందుకు వెనుకాడుతోంది.. అని ఒక దౌత్యవేత్త వ్యాఖ్యానించారు. దీనివల్ల భారత్‌కు లభించిన ప్రయోజనమేమిటి? 'ఇవాళ భారతదేశాన్ని, మన జాతీయ వాదాన్ని పటిష్ఠం చేసుకోవడం ఒక్కటే మార్గం. మన వెన్నుముక బలంగా ఉండాలి. ఎటువంటి ఒత్తిళ్లకూ లొంగకుండా, రాజీపడకుండా ఉండాలి' అని రామ్ మాధవ్ పుస్తకావిష్కరణ సందర్భంగా ఉపరాష్ట్రపతి చెప్పారు. 'బహుపక్ష వాదం క్షీణించిపోవడంతో పాటు సమాజాలను నడిపించే వ్యవస్థలు కూడా తుప్పుపట్టిపోతున్నాయి. ప్రజల హక్కులను పరిరక్షించగల సంస్థలు దెబ్బతిన్నాయి. ప్రజాస్వామ్య ప్రపంచాన్ని పనిచేయించే విధంగా తప్పొప్పులను బేరీజు వేసి సరిదిద్దుకునేలా చేయగల శక్తులు లేకుండాపోయాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 75 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ అంతర్జాతీయ ఉదారవాద వ్యవస్థ అన్నది ఇప్పుడు మచ్చుకైనా కనపడడం లేదు అని ఈ సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు, సీనియర్ కాంగ్రెస్ నేత మనీష్ తివారీతో పాటు పలువురు ప్రముఖులు వ్యాఖ్యానించారు. మన జాతీయ ప్రయోజనాలకు తగ్గట్లుగానే అంతర్జాతీయ దౌత్యనీతిని ఏర్పర్చుకోవాలని వారు వ్యాఖ్యానించారు.

## ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై సంచలన నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

జూన్ 25న జల సౌధలో సీనియర్ నీటిపారుదల అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 30న మధ్యాహ్నం 3 గంటలకు ప్రజా భవన్‌లో గోదావరి -బనకచెర్ల లింక్ ప్రాజెక్టుపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఉంటుందన్నారు. గత BRS పాలనలో ఈ ప్రాజెక్టు ఎలా ఉద్భవించిందో స్పష్టమైన డాక్యుమెంటేషన్‌ను చేర్చడానికి ప్రజెంటేషన్‌ను రెడీ చేయాలని ..తద్వారా ఆంధ్ర ప్రస్తుత చర్య వెనుక ఉన్న రాజకీయ నేపథ్యాన్ని బహిర్గతం చేయాలని ఆయన ఆదేశించారు.

ఇప్పటికే జూన్ 19న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. బనకచర్లపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలను అతిక్రమించి బనకచర్ల నిర్మిస్తోందని కంప్లైంట్ ఇచ్చామని భేటీ తర్వాత మంత్రి ఉత్తమ్ తెలిపారు..తమ అభ్యంతరాలను కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ కు చెప్పినట్లు తెలిపారు. ఏపీ చట్ట వ్యతిరేకింగా నిర్మాణం చేపడుతుందని.. అనుమతులు ఇవ్వద్దని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బనకచర్ల నిర్మాణంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. బనకచర్ల పునర్విభజన చట్టానికి పూర్తి విరుద్ధమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ రైతుల్లో ఆందోళన నెలకొందని, బనకచర్లకు అనుమతి ఇవ్వద్దని కోరినట్లు చెప్పారు.

**ఏపీ తీరుతోనే వివాదం..**

సముద్రంలో కలిసే గోదావరి జలాల విషయంలో వాస్తవాలు, రాజకీయాలు ముడిపడి ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. "వాస్తవానికి సముద్రంలో కలిసే జలాలపై ఏపీ, తెలంగాణ కూర్చొని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారమయ్యేది. కానీ తెలంగాణ ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రం దగ్గరకు వెళ్లడం సరికాదు. ఇది బీఆర్ఎస్‌కు రాజకీయ ఆయుధంగా మారింది. ఏపీ విభజన చట్టం%-%2014లో రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల కోసం ఆఫీసర్స్, టెక్నికల్, అపెక్స్ కౌనిల్స్ ఏర్పాటు చేశారు.

## ప్రేమ వ్యవహారానికి అడ్డొస్తుందనే అంజలి హత్య.. కుమార్తె సహా ముగ్గురి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన అంజలి హత్య కేసును 24 గంటల్లో ఛేదించామని బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

ప్రేమ వ్యవహారానికి పదే పదే అడ్డొస్తుందని పదో తరగతి చదువుతున్న కన్న కూతురే.. తన ప్రియుడు, ప్రియుడి తమ్ముడితో కలిసి తల్లిని హత్య చేసిందని డీసీపీ సురేష్‌కుమార్ తెలిపారు. "ఈనెల 19 బాలిక ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె తల్లి 20న జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు పెట్టారు. బాలిక 20వ తేదీ రాత్రి ఇంటికి తిరిగొచ్చింది. 23న షాపూర్‌నగర్‌లోని ఇంట్లో అంజలి(39) పూజ చేస్తుండగా పథకం ప్రకారం చున్నీతో గొంతు నులిమి, తలపై కొట్టి హత్యకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. కొన్ని నెలలుగా నిందితురాలు (కన్న కూతురు) తల్లితో గొడవ పడుతూ ఉండేది. ప్రేమ విషయంలో అడ్డొస్తుందనే ఉద్దేశంతో తల్లిని హత్య చేసినట్లు నిందితురాలు దర్యాప్తులో తెలిపింది. డీజే ఆపరేటర్‌గా పనిచేస్తోన్న శివ(19) ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికకు పరిచయమయ్యాడు. ముగ్గురు నిందితులపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాం" అని డీసీపీ తెలిపారు.

## ప్రభుత్వం నియంతగా మారితే.. ప్రజలే దాన్ని పడగొడతారు: అమిత్ షా

దిల్లీ: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ హయాంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించిన అత్యవసర పరిస్థితి జాతీయ అవసరం కాదని.. కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యతిరేక మనస్తత్వానికి అది ప్రతీక అని అమిత్ షా ఆరోపించారు. కేవలం తన పదవిని కాపాడుకోవడానికి మాత్రమే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1975, జూన్ 25న అత్యవసర పరిస్థితిని విధించారన్నారు. ఆ సమయంలో దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించివేశారని, న్యాయవ్యవస్థ చేతులు కట్టేశారని, సామాజిక కార్యకర్తలను జైళ్లలో బంధించారని షా పేర్కొన్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడ్డారని తెలిపారు. ప్రభుత్వం నియంతలా మారినప్పుడు, దానిని పడగొట్టే శక్తి ప్రజలకు ఉంటుందని ఈ రోజు అందరికీ గుర్తు చేస్తోందని షా అన్నారు.

అత్యవసర పరిస్థితి సమయంలో దేశంలోని ప్రజలు ఎన్నో హింసలు, బాధలు ఎదుర్కొన్నారని అమిత్ షా అన్నారు. అప్పుడు వారు ఎదుర్కొన్న సమస్యలను నేటితరానికి తెలియజేయడానికి భాజపా ప్రభుత్వం జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య రక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పించడమే తమ ఉద్దేశమని అన్నారు. తద్వారా కాంగ్రెస్ వంటి నియంతృత్వ శక్తులు మళ్లీ అటువంటి భయానక సంఘటనలను పునరావృతం చేయకుండా ఉంటాయని వ్యాఖ్యానించారు.

**సరిగ్గా 50 ఏళ్ల క్రితం 1975 జూన్ 25న ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించారు.**

అంతర్గత కారణాల వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లినట్లు పేర్కొంటూ నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 కింద ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ కాలంలో దేశ పౌరులు, పత్రికల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ తీవ్ర అణచివేతకు గురయ్యాయి. సుమారు 1.5 లక్షల మంది జైలు పాలయ్యారు. 1977, మార్చి 21 వరకు ఇది కొనసాగింది. దీంతో నాటి పరిస్థితులను వ్యతిరేకిస్తూ.. కేంద్ర ప్రభుత్వం బుధవారం దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించనుంది. కేంద్రమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో దిల్లీలో నేడు 'ప్రజాస్వామ్య యాత్ర'ను ప్రారంభించనున్నారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, ఎమర్జెన్సీ నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలపై అవగాహన పెంచేందుకు ఈ యాత్రను దేశవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ వెల్లడించింది.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి

కంపెనీల చట్టం 2013 ప్రకారం.. బనకచర్ల నిర్మాణం కోసం ఏపీ 'జలహారతి కార్పోరేషన్ లిమిటెడ్' పేరున ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసింది. విజయవాడ కేంద్రంగా ఈ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వరద జలాల నిర్వహణ, పోలవరం - బనకచర్ల నిర్మాణం, ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఈ కార్పోరేషన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది.

బనకచర్ల ప్రాజెక్టుపై అన్ని అధ్యయనాలు చేసిన తర్వాత ఈ కార్పోరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు జీవోలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అండర్ లో జలహారతి కార్పోరేషన్ ను విజయవాడలో ఏర్పాటు చేసేందుకు పర్మిషన్ ఇస్తున్నట్లు చీఫ్ ఇంజినీర్ కు ఉత్తర్వులు జారీ చేసింది.

బనకచర్ల నిర్మాణం అక్రమమని.. ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోమని తెలంగాణ ప్రభుత్వం పునరుద్ఘాటిస్తున్న సందర్భంలో ఏపీ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

## అదనపు కలెక్టర్లు వారంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు సందర్శించాలి సీఎం రేవంత్ ఆదేశం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 48 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని సీఎంకు అధికారులు వివరించారు. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించాలని, గ్యాస్.. కట్టెల పొయ్యిల బాధ లేకుండా మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు సోలార్ కిచెన్లు ఏర్పాటుపై వెంటనే దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణలవుతున్న విద్యార్థులకు, ఇంటర్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య తేడా ఎందుకు ఎక్కువగా ఉందని అధికారుల్ని ప్రశ్నించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ తర్వాత జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందొచ్చని, తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదు: శ్రీధర్‌బాబు ఆవేదన

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో మెట్రోకు అనుమతి వస్తుందని భావించామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

## హైదరాబాద్‌లో బోనాలు..

మొదటిపేజీ తరువాయి

ఆషాఢ మాసంలో ముందుగా నగరంలోని గోల్కొండ బోనాలు జూన్ 29న జులై 1, 2 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జులై 13, 14 తేదీల్లో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం బోనాలు, జులై 20న లాల్ దర్వాజా బోనాలు.. జులై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి బోనాలు, మిగిలిన దేవాలయాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు.

## హైకోర్టు తీర్పు మేరకు స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

మొదటిపేజీ తరువాయి

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, తప్పించుకోవద్దని అన్నారు. పార్టీల పరంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రేవంత్‌రెడ్డి అనడం బీసీలను మోసం చేయడమేనని విమర్శించారు. కులగణన పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. తూతూమంత్రంగా బీసీ కులగణన చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేందప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 2 వేల కోట్ల నిధులు ఆగిపోయాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. తెలంగాణ కులగణనలో 90 శాతం ముస్లింలను బీసీల్లో చేర్చి, నిజమైన బీసీలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు అమ్మకుండా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల భూములను వెనక్కి అడుగుతున్న తెలంగాణ ప్రభుత్వం వాటిని అమ్మాలని భావిస్తుందా అని నిలదీశారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వం భూముల అమ్మకాన్ని మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ భూముల అమ్మకాన్ని అడ్డుకొని తీరుతామని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ హెచ్చరించారు. బీసీ కులగణన హైదరాబాద్‌లో జరగలేదని రేవంత్ ప్రభుత్వం చెబుతోందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే పరిశీలిస్తుందని సూచించారు. కాళేశ్వరం కమిషన్ సీరియల్‌గా నడుస్తోందని ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తి అయిందని గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్ తాను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి జరిగి ఉండొచ్చని.. తాను అప్పుడు పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. ఫార్ములా ఈ రేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులు ఏడాది కాలం నుంచి సాగదీస్తున్నారని విమర్శించారు.

# కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ లీడర్లను అడుగు చెప్తరు

- మహిళలకు రూ.2,500 ఇవ్వాలని, పింఛన్లు పెంచాలని డిమాండ్
- కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు
- చంద్రబాబుకు బిర్యానీ పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్ గా ఇచ్చిందే నువ్వు
- అసెంబ్లీలో ఆరు గ్యారంటీలు, హామీల అమలుపై చర్చించే సత్తా ఉందా
- సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25**
కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి పోస్టు కార్డులు కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్ పోరాడి తెలంగాణ సాధించారు కాబట్టే ఈరోజు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు.
అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియాగాంధీ హామీ ఇచ్చిన మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వడంతో పాటు పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ బుధవారం



తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అబిడ్స్ జనరల్ పోస్ట్ ఆఫీస్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం సోనియాగాంధీకి పోస్ట్ కార్డులు పోస్ట్ చేశారు.
ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, ఏపీ సీఎం చంద్రబాబును పిలిచి ప్రజాభవన్ లో హైదరాబాద్ బిర్యానీ పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్ గా ఇచ్చిందే రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయబోరని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టి ఆరు గ్యారంటీలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై చర్చించే సత్తా ఉందా అని నిలదీశారు. గ్యారంటీలపై, మహిళలకు, పింఛన్లు పొందే అవ్వాతాతలకు చేసిన మోసంపై చర్చిద్దామా అన్నారు. 2016లో అసలు పోలవరం %-% బనకచర్ల లింక్ ప్రాజెక్టు అనే ప్రస్తావనే లేదన్నారు. అబద్ధాలు ఆడటం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందన్నారు. హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి తాను ముఖ్యమంత్రి అన్న విషయం గుర్తించి హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించబోరని అన్నారు.
పింఛన్లు పెంచాలని, మహిళలకు రూ.2,500 ఇవ్వాలని



సోనియాగాంధీకి పోస్టు కార్డులు
సోనియాగాంధీ ఎన్నికలకు ముందు తెలంగాణ వచ్చి హామీ ఇచ్చారు కాబట్టే ప్రజలు నమ్మి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోనియాగాంధీ హామీ ఇచ్చినట్టుగా మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని, వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, ఇతర పింఛన్ లబ్ధిదారులకు నెలకు రూ.4 వేలు, వికలాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇచ్చేలా రేవంత్ రెడ్డికి సోనియా గాంధీ ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇందుకోసమే సోనియాగాంధీకి వేలాది పోస్టు కార్డులు రాస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. సోనియాగాంధీ సంతకం పెట్టిన గ్యారంటీ కార్డులను ఎన్నికలకు ముందు ఇంటింటికీ పంపి ప్రజలను మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు మహేందర్, సంపత్ గౌడ్, రూప్ సింగ్, అర్చనా సేనాపతి, లలిత యాదవ్, మనోజా గౌడ్, శోభ, లావణ్య, కవిత, పరమేశ్వరి, రజిత రెడ్డి, ఈగ సంతోష్, మనోజ్ గౌడ్, నరేందర్ యాదవ్, రాము యాదవ్, మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

- జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నిరోధక స్థాయి సమావేశంలో కలెక్టర్, సీపీ

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25**
మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకముందు అవలంభించాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్, సీపీ దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలంను కట్టడి చేసేందుకు గట్టి నిఘా ఉంచాలన్నారు. క్లోరోఫాం, డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి వాటిని వినియోగిస్తూ తయారు చేసిన కల్తీ కల్లు సేవిస్తుండడం వల్ల అనేక మంది అనారోగ్యాల బారిన



పడుతున్నారని, కొంతమంది గర్భిణీ మహిళలు కూడా దీనిని సేవిస్తున్నట్లు తెలుస్తోందని, ఇది సదరు మహిళల ఆరోగ్యాన్ని దెబ్బ తీయడంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం పై కూడా తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గర్భిణీ స్త్రీలు కల్తీ కల్లు బారిన పడకుండా గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా అంగన్వాడీ కార్యకర్తల ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీని ఆదేశించారు. ప్రజలకు ప్రాణాంతకంగా పరిణమించే అల్ప్రాజోలం, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, గంజాయి వంటి మత్తు పదార్థాలను నియంత్రించే దిశగా అంకితభావంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని హితవు పలికారు. నిరంతర దాడులు కొనసాగిస్తూనే, వీటి పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ వారిని చైతన్యపర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం



చేస్తూ పూర్తి స్థాయిలో అవి పని చేసేలా చూడాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ అనేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ గుర్తు చేశారు. ఎక్కడైనా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం వంటి వాటి రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు కూడా ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చని సీ.పీ సాయి చైతన్య సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మారెడ్డి, డీఈఓ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సుధాకర్, డీటీఓ ఉమా మహేశ్వరరావు, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# అతిసార వ్యాధి నియంత్రణపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం




**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అతిసార వ్యాధి నియంత్రణపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ స్టాప్ డయేరియా క్యాంపెయిన్(అతిసార వ్యాధి నిరోధక అవగాహన కార్యక్రమం) ఈనెల 16వ తేదీ నుండి జూలై 31 వరకు కొనసాగుతుందని,ముఖ్యంగా ఐదు సంవత్సరాలు లోపు పిల్లల్లో అతిసార వల్ల కలిగే మరణాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉందన్నారు. డయేరియా కి రోకతం ,సఫారీ ఔర్ ఓఆర్ఎస్ సే రకే అప్నా ధ్యాన్అనే అంశంని ఈసంవత్సరం 2025 నినాదంగా ఇచ్చిందన్నారు. 2014 సంవత్సరంలో మొదలైన ఐడీసీఎఫ్ అనే కార్యక్రమాన్ని పేరు మార్చి స్టాప్ డయేరియా క్యాంపెయిన్గా గత సంవత్సరం నుండి నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఓ ఆర్ ఎస్ మరియు జింక్ కార్నర్ ను ఏర్పాటు చేయాలని, ఐఇసిని ప్రదర్శిస్తూ ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆశలు, ఏఎన్ఎంలు వారి వారి గృహ సందర్శనలో అతిసార వ్యాధి నియంత్రణ కార్యక్రమం పై ప్రతి ఇంటిలో అవగాహన కలిగించాలని కోరారు. ఈ అతిసారకు గురయ్యే చిన్నపిల్లలు ముఖ్యంగా మురికివాడలు, ఇటుక బట్టీలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టే ప్రదేశాలు , కరువు వరదలు సంభవించే ప్రదేశాలు ,వీధి బాలలు, అపరిశుభ్ర వాతావరణంలో తాగునీటి సౌకర్యం లేని పట్టణ మరియు గిరిజన ప్రాంతాల్లో నీ చిన్న పిల్లలు ఈ అతిసార వ్యాధికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. జిల్లాస్థాయి మరియు పిహెచ్సి స్థాయిలో వైద్యాధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలకు ఈ కార్యక్రమం పై శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ప్రతి గ్రామంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ ద్వారా క్లోరినేషన్ చేయాలని అన్నారు. అతి సారా వ్యాధిలో కొద్దిపాటి, సాధారణం, మరియు తీవ్రమైన లక్షణాలు ఉంటాయని గుంతలు పడిన కళ్ళు, తగ్గిన మూత్ర విసర్జన, చిన్నపిల్లల్లో తలపై పాంటినెల్ల గుంతగా ఏర్పడడం, పొడి బారిన చర్మం ప్రధానమైన లక్షణాలుగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీలో భాగస్వాములైన వివిధ శాఖల అధిపతులు వారి వారి శాఖలో వైద్యశాఖ సమన్వయంతో అతిసార వ్యాధి నియంత్రణపై పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో చేతుల పరిశుభ్రత మరియు ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసే విధానంపై అంగన్వాడీ



కార్యకర్తలకు వివరించాలన్నారు. శుద్ధి చేసిన నీటినే త్రాగాలని ,ప్రతి గ్రామంలోని నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, క్రమం తప్పకుండా వాటిని శుభ్రపరచాలన్నారు. మీ మీ శాఖల ఆధ్వర్యంలో ప్రజల్లో విస్తృతమైన అవగాహన కలిగిస్తూ అతిసార వ్యాధి నియంత్రణపై ముద్రించిన పోస్టర్లు ప్రదర్శించాల్సిందిగా వివిధ శాఖలకు సూచించారు. ఓ ఆర్ ఎస్ మరియు జింక్ మాత్రలు ప్రతి అంగన్వాడి కేంద్రం మరియు పాఠశాలల్లో అందుబాటులో ఉండేలాగా చూడాలన్నారు. ఈకార్యక్రమను జూలై వరకు నిర్వహిస్తూనే ఈ సీజన్ అక్టోబర్ వరకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే మురికివాడల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి అతిసార వ్యాధితో పాటు కిటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ లాంటి వాటిని అరికట్టే చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్ పై ముద్రించిన పోస్టర్లను జిల్లా అడిషనల్ కలెక్టర్ చేతుల మీదగా ఆవిష్కరించడం జరిగింది. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ మాట్లాడుతూ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించటానికి చక్కని ప్రణాళికతో వివిధ శాఖల సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి ప్రతి గ్రామంలో అతిసార వ్యాధితో ఏ ఒక్కరూ మరణం చె%శీ%దకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ సాయ గౌడ్, డీ డబ్ల్యు ఓ రసూల్ బి, ఆర్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈ ఈ ధర్మేందర్, మున్సిపల్ కమిషనర్ ఆర్మూర్ రాజు, పి ఓ లు రాజు, సుప్రియ,సానిటరీ ఇన్స్పెక్టర్ షాదుల్లా, సిడిపిఓ సౌందర్య, డిపిహెచ్ఎన్ఓ స్వామి సులోచన, డి హెచ్ ఈ హెచ్ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, రాజా బాబు, సచిన్ ,తరుణ్, వినోద్ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రేమ కోసం కన్న తల్లినే హతమార్చిన కన్న కూతురు



**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జూన్ 25 :**
కుత్బుల్లాపూర్ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన అంజలి హత్య కేసులో నిందుతుల వివరాలు వెల్లడించారు బాలానగర్ డిసీపీ సురేష్ కుమార్.
తమ ప్రేమ వ్యవహారానికి పదే పదే అడ్డొస్తుందని పదవ తరగతి చదువుతున్న కన్న కూతురే (తేజశ్రీ) తన ప్రియుడు, మరియు ప్రియుడి తమ్ముడితో కలిసి తల్లిని హత్య చేశారని తెలిపిన పోలీసులు. ఈ నెల 23 న సోమవారం సాయంత్రం షాపూర్ నగర్ లోని మృతురాలి ఇంట్లో అంజలి(39) పూజ చేస్తుండగా పక్క ప్లాన్ తో గొంతు నులిమి, తలపై కొట్టి హత్య కు పాల్పడ్డట్లు గా దర్యాప్తులో తేలిందన్నారు పోలీసులు. గత కొద్ది నెలలుగా నిందితురాలు (కన్న కూతురు) తల్లితో గొడవలు పడుతూ ఉండేదని,తన ప్రేమ విషయంలోనూ అడ్డొస్తుందనే ఉద్దేశంతో తల్లిని హత్య చేసినట్లు నిందితురాలు దర్యాప్తులో తెలిపిందని అన్నారు. ప్రియుడు శివ(19) డిజే ఆపరేటర్ గా పని చేస్తూ ఉండేవాడని,ముగ్గురు నిందుతులపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు డీసీపీ సురేష్ కుమార్.

## ఘనంగ బిఆర్ఎస్ కెవి రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి జన్మదిన వేడుకలు




**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జూన్ 25 :**
కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ కెవి రాష్ట్ర కార్మిక నాయకుడు , శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి జన్మదిన వేడుకలు జగద్గిరిగుట్ట , పాపిరెడ్డి నగర్ లోని తన కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు , కార్మిక నాయకులు , కార్మికులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో హాజరయ్యారు. రవి జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా పలువురు బొకేలతో శాలువాతో సన్మానం చేసి కేక్ కట్ చేసి జ్ఞాపికలను అందజేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా మూసాపేట్ మాజీ కార్పోరేటర్లు తూము శ్రావణ్ కుమార్ , పగడాల బాబు రావు , జిల్లా గోపాల్, మల్లేష్,పాండు గౌడ్, తుకారాం,ఇనుగంటి రాజు, శ్రీనివాస్, అరుణ్,ఎజాజ్, నరేష్ , మీడియా మిత్రులతో పాటు అనిల్ , సుదర్శన్ , జగన్ , మనోజ్ శ్రీనివాస్ చారి, అభిమానులు, పలువురు రాజకీయ నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు రవి కి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవి మాట్లాడుతూ... కార్మికల హక్కుల కోసం , సమస్యల పరిష్కారం కోసం ఎల్లపుడు మీ వెంట ఉంటా అని అన్నారు

## నేరాల నియంత్రణ ప్రణాళికల ప్రకారం పని చేయాలని

- నేరాల నియంత్రణపై నెలవారి సమీక్ష సమావేశం
- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపు నిచ్చారు




**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25 :**
ప్రతి పోలీస్ స్టేషన్పరిధిలో రాబోయే ఆరు నెలల కాలానికి నేరాల నియంత్రణకు ప్రణాళికల ప్రకారం పని చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపు నిచ్చారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బోధన్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణపై నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతు.. నేరాల నియంత్రణకు ప్రతి పిఎస్ పరిధిలో బందోబస్తును సమర్థవంతంగా నిర్వహించి, సిబ్బందికి సంబంధించి వెల్ఫేర్ కోసం యాక్షన్ ప్లాన్ నిర్వహించాలని కోరారు. చోరీల విషయంలో ట్రెండ్ ను అర్థం చేసుకొని పెట్రోలింగ్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన బ్లాక్ స్పాట్ పై శ్రద్ధ చూపాలని కోరారు. పెండింగ్ కేసుల పరిశోధన పూర్తి చేయాలని, కోర్టు కేసుల పరిష్కారం దిశగా పనిచేస్తు, మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తు గేమింగ్ యాప్ లతో పాటు మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి లాంటి చట్ట వ్యతిరేక కార్యాకలపాలపై తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని అన్నారు. ఈసమావేశంలో నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి తో పాటు ఎ.సి.పిలు, సి.ఐలు, ఎస్.ఐలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్ పెక్టర్ శ్రీశైలం పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు

**- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, బ్లాక్ ప్లాంటేషన్ పరిశీలన**

**- భీంగల్ మున్సిపల్ పరిధిలో కార్యక్రమాల అమలుపై సమీక్ష**

**- లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం**

**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25**
వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన భీంగల్ మున్సిపాలిటీని సందర్శించారు. పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో వార్డు వారీగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షించిన కలెక్టర్, స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక, మంజూరీ ప్రక్రియలలో జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకునేందుకు అనేక మంది ఆసక్తి చూపుతున్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో సైతం ఇందిరమ్మ ఇళ్లను అందించాలనే ప్రభుత్వ సంకల్పం మేరకు మున్సిపాలిటీల పరిధిలో కూడా ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, మంజూరీలు తెలుపబడిన వారందరూ ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని, అవసరమైతే ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని లబ్దిదారులకు మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ కింద లక్ష రూపాయల వరకు రుణం అందించేలా చొరవ చూపాలని అన్నారు. తీసుకున్న రుణాన్ని ఇంటి నిర్మాణానికి వెచ్చించేలా నిశిత పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని, నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం తరపున అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఉచితంగా ఇసుక సరఫరా వంటి తోడ్పాటును అందించాలని సూచించారు. భారీ వర్షాలు కురిస్తే నిర్మాణ పనులకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉన్నందున, బేస్మెంట్ లెవెల్ వరకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేలా చొరవ చూపాలని అన్నారు. ఆయా దశల ఇళ్ల నిర్మాణాలను అనుగుణంగా లబ్దిదారుల ఖాతాలలో బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తాను తదుపరి సమీక్ష జరిపే సమయానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పూర్తి స్థాయిలో పురోగతి కనిపించేలా అంకిత భావంతో పని చేయాలని అన్నారు.

కాగా, పచ్చదనాన్ని పెంపొందిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వీలుగా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ చేపడుతున్న మన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని, వాటిని నాటి పరిరక్షించేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించే విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. గత సీజన్ లో నాటిన మొక్కల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలను ఆయా కేటగిరీలుగా విభజిస్తూ, పూలు, పండ్ల మొక్కలను నివాస గృహాల కోసం పంపిణీ చేయాలని, మూడు మీటర్ల వరకు ఎత్తు కలిగిన మొక్కలను అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్ ల కోసం వినియోగించాలని తెలిపారు. నాటిన ప్రతి మొక్క బతికేలా పక్కాగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇదిలా ఉండగా, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నివాస ప్రాంతాల నడుమ ఖాళీ ప్రదేశాలలో నిలువ నీరు ఉండకుండా చూడాలని అన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు మురికి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలని, మంచినీటితో కూడిన వనరులలో గంబుషియా చేప పిల్లలు వదలాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని నివాస ప్రాంతాల్లో, వ్యాపార వాణిజ్య సంస్థలలో విధిగా డ్రై డే పాటించేలా చూడాలన్నారు. ఎక్కడైనా మలేరియా, విష జ్వరాలు వంటి పాజిటివ్ కేసులు నమోదు అయితే, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలని, స్థానికుల బ్లడ్ శాంపిల్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించాలని, అవసరమైన వారికి చికిత్సలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమీక్ష అనంతరం కలెక్టర్, భీంగల్ పట్టణంలోని బోయిగల్లి, బాపూజీనగర్ లలో లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా గత సంవత్సరం మొక్కలు నాటిన బ్లాక్ ప్లాంటేషన్ ను తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఆన్ లైన్లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఆగస్టు 14వ తేదీ లోపు అన్ని దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, భీంగల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, తహసీల్దార్ షబ్బీర్ తదితరులు ఉన్నారు.

# మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం

**- శవాల పైన రాజకీయాలు చేయడం మానుకోవాలి:కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి**



**గొల్లపెల్లి (మన వెలుగు) జూన్ 25 :**
జగిత్యాల జిల్లా గొల్లపెల్లి కేంద్రంలోని స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది.
ఈ పాత్రికేయుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం గొల్లపెల్లి మండలం బిబి రాజు పల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ దాసరి శంకరయ్య అతని యొక్క మామిడి తోటలో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. దాసరి శంకరయ్య ఆత్మహత్య చేసుకుని చనిపోతే వారి కుటుంబాన్ని ఆదుకొని చెయుతనియ్యాల్సిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురద చల్లడం సరయిన పద్ధతి కాదు. బిబి రాజు పల్లి మాజి సర్పంచ్ అతను గడిచిన 10 సంవత్సరాలలో సర్పంచ్ గా కొనసాగలేదు అంతకంటే ముందుగానే అంటే పది సంవత్సరాల కంటే ముందు అతను తన యొక్క గ్రామానికి సర్పంచిగా సేవలు చేయడం జరిగింది.అదేవిధంగా అతనికి ఏదైతే గ్రామానికి సంబంధించిన పనులు చేశాడో ఆ పనులు కాంగ్రెస్ పార్టీ 2023 వ సంవత్సరంలో అధికారంలో రావడానికి అంటే ముందే అతనికి మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ 2023 అసెంబ్లీ ఎలక్షన్ ని దృష్టిలో ఉంచుకొని ఫేక్ ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగింది.గడిచిన 10 సంవత్సరాలలో టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని ఆగం చేసింది.రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ లోటు చేసి చిన్న బిన్నం చెంసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీపై మాట్లాడే నైతిక హక్కు లేదు.రాష్ట్రంలో బి ఆర్ ఎస్ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో 25 మంది సర్పంచులు ఆత్మ హత్య చేసుకోవడం జరిగింది,అప్పుడు నిన్న మీడియా సమావేశం నిర్వహించిన మాజీ సర్పంచులు ఎక్కడ ఉన్నారు...? గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులకు సంబంధించి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ 2023వ ఎలక్షన్స్ ని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామానికి మరియు గ్రామాలలో ఉన్నటువంటి సంఘ భవనాలకు చాలా ఫేక్ ప్రోసిటింగ్స్ ఇవ్వడం జరిగింది.బిబి రాజ్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులు చేసినప్పుడు గతంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఎందుకు బిల్లులు చెల్లి లేకపోయింది? గత ప్రభుత్వం యొక్క తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి మరియు కాంగ్రెస్ పార్టీని బదునం చేస్తే ఊరుకునేది లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇట్టి మీడియా సమావేశం ద్వారా వారిని హెచ్చరించడం జరుగుతుంది ఇటువంటి అసత్య ప్రచారాలు మానుకొని ప్రజలకు ఏమైనా ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని వారికి సూచించడం జరుగుతుంది.ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్ వైస్ చైర్మన్ పురాపాటి రాజిరెడ్డి మాజీ సర్పంచులు చిర్ర గంగాధర్ రేవెళ్ళ సత్యనారాయణ గౌడ్ సరసాని తిరుపతి రెడ్డి పురంశెట్టి వెంకటేశం మాజీ ఎంపీటీసీ సభ్యులు దాసరి తిరుపతి గౌడ్ నాయకులు రాపల్లి గంగన్న,కొండ వెంకటేష్ గౌడ్ కాషా గంగాధర్ నారాయణ చెవులమద్ది గంగాధర్ గడప రవి తడగొండ విజయ్ శివరాజం రాజు రాజేందర్ రామ్మోహన్ రెడ్డి సిరికొండ తిరుపతి కందుకూరు శ్రీనివాస్ అంజి పట్టణ అధ్యక్షులు నేరెళ్ళ మహేష్ నల్ల విక్రమ్ రెడ్డి బెక్కెం గంగారం ఎండి ముజ్జు వరద మహేష్ బాబు జలంధర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం

**- ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయం**



**గొల్లపెల్లి (మన వెలుగు) జూన్ 25 :**
జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో సంవిధాన్ హత్య ధివాస్ సందర్భంగా స్థానిక ఆర్య వైశ్య భవన్లో బీజేపీ మండల అధ్యక్షులు చెవులమద్ది శేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు కట్ట మహేష్ మాట్లాడుతూ దేశంలో ఎమర్జెన్సీ పాలనకు నేటికి 50 ఏళ్లు 1975 జూన్ 25 నుండి 21 నెలలపాటు ఎమర్జెన్సీ పాలన పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దేశ ప్రజల గొంతును నొక్కేశరని కాంగ్రెస్ పార్టీ అధికార దాహానికి ఎమెర్జెన్సీ పాలన ఓ నిదర్శనం అన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని నిలుపుకోవడానికి రాజ్యాంగ విరుద్ధంగా ఎన్ని అడ్డదారులైన తొక్కేందుకు చివరకు ప్రజల ప్రాణాలను తీసేందుకు, ప్రజ్వాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వెనుకాడదనే దానికి ఎమర్జెన్సీ పాలనే ఓ ఉదాహరణ ఎమెర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రతిపక్ష నాయకులను ఆర్ఎస్ఎస్ ఏబీవీపీ జనసంఘ్ నాయకులను మీసా కింద జైళ్లలో పెట్టారన్నారు పత్రికలపై సెన్సార్ విధించారు పౌరుల ప్రాథమిక హక్కులను హరించారు మానవ హక్కులను, స్వేచ్ఛను హరించి వేశారు ప్రశ్నించిన ఎంపీల సభ్యత్వాన్ని కూడా రద్దు చేసిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు తెలుగు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన డీఎస్పీ రెడ్డి జంగారెడ్డి వి.రామారావు జూపూడి యజ్ఞ నారాయణ పీవీ చలపతి రావు వెంకయ్యనాయుడు సీహెచ్ విద్యాసాగర్ రావు ఇంద్రసేనా రెడ్డి అశోక్ యాదవ్ తదితర ఏబీవీపీ జనసంఘ్ కార్యకర్తలతోపాటు చాలా మంది సంఘ్ పరివార్ కార్యకర్తలను అరెస్ట్ చేసిన చరిత్ర కాంగ్రెస్ దే ఎమెర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీ బృందం చేసిన అరాచకాలకు అంతులేదన్నారు ఎమర్జెన్సీ పాలనతో విసిగిన ప్రజలు కాంగ్రెస్ ను ఓడించినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాకపోవడం సిగ్గు చేటు కేంద్రంలో అధికారంలో ఉన్నంత కాలం రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కాంగ్రెస్ కూలదోసింది 1947 నుంచి 2014 వరకు రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కాంగ్రెస్ ఏకంగా 90 సార్లు ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసింది అన్నారు అబద్ధాలను ప్రజల్లోకి ప్రచారం చేయడం ఎన్నికల యంత్రాంగంపై నిరాధార ఆరోపణలు మైనారిటీల బుజ్జగింపు ఓటుబ్యాంకు రాజకీయాలు విభజన రాజకీయాలు, ఎన్నికల హింస ఓటర్లను ప్రలోభ పెట్టడం రాజ్యాంగం దాని సూత్రాల పట్ల గౌరవం లేకపోవడం వంటివి కాంగ్రెస్ లక్షణాలు అన్నారు బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తారుమారు చేస్తుందని రిజర్వేషన్లను నాశనం చేస్తుందని ఎస్సీ ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందని పార్లమెంట్ ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి ఓట్లు పొందాలని చూసిన కాంగ్రెస్ కు దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతలు మారలేదు ఈ విషయంలో రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరాగాంధీని మించి పోయారు భారతదేశాన్ని అస్థిరపరచడంలో బలహీనపరచడంలో విదేశీ శక్తుల పాత్ర ఉందనే సాకుతో అధికారాన్ని నిలుపుకునేందుకు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధిస్తే అధికారం కోసం ఆయన మనవడు రాహుల్ గాంధీ వివిధ దేశాల్లో పర్యటిస్తూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది అనే ముసుగులో భారత్ లో పాశ్చాత్య దేశాల జోక్యం అవసరమంటూ నిస్సిగ్గుగా వేడుకుని దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నించారు ఇకనైనా కాంగ్రెస్ కుటిల రాజకీయాలను చీకటి ఒప్పందాలను వీడి ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడాలన్నారు ఈ కార్యక్రమంలో సింహాచలం సత్యం ముసలి కొమురయ్య మండల ఉపాధ్యక్షులు కట్ట క్రాంతి మండల ప్రధాన కార్యదర్శులు. లక్కాకుల వెంకటేష్ దూస ప్రశాంత్ ముత్యాల స్వామి
మండల కార్యదర్శిలు సిద్దుల రాజేష్ మండల కోశాధికారి భీమ జలపతి పట్టణ అధ్యక్షులు సంగం కళ్యాణ్ దళిత మోర్చా అధ్యక్షులు గుంటుకుల జగదీష్ యువ మోర్చా అధ్యక్షులు మారం గణేష్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు వనపర్తి రాజేందర్ మండల ఐటీసీలు కన్వీనర్ ఎదలాపురం సాయికుమార్ .బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## 2,72,822 మంది రైతుల ఖాతాలలో రూ. 316.93 కోట్ల రైతు భరోసా నిధులు జమ

**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25 :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 2,72,822 మంది రైతుల ఖాతాలలో రూ. 316.93 కోట్ల నిధులు జమ అయ్యాయని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం - 2025 సీజన్ కు సంబందించి పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం జిల్లాలో మొత్తం 2,98,510 మంది రైతులకు రూ. 326.07 కోట్ల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీ నుండి ఇప్పటివరకు జిల్లాలోని 2,72,822 మంది రైతుల ఖాతాలలో రూ. 316.93 కోట్ల నిధులను ప్రభుత్వం నేరుగా జమ చేసిందని కలెక్టర్ వెల్లడించారు.

## వృద్ధురాలిని పరామర్శించిన కలెక్టర్

**- మెరుగైన చికిత్స అందించాలని ఆదేశం**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25 :**
ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెర్కిట్ ప్రాంతానికి చెందిన బుజ్జమ్మ అనే వృద్ధురాలిని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న బుజ్జమ్మను అంబులెన్స్ సిబ్బంది గమనించి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించగా,ఆమెను ఆసుపత్రి వర్గాలు సరిగా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పలువురు ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో తక్షణమే స్పందించిన కలెక్టర్, వృద్ధురాలు బుజ్జమ్మకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జీజీహెచ్ ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. అయితే తమ స్వస్థలమైన పెర్కిట్ కు చేరువలో ఉన్న ఆర్మూర్ లో చికిత్స చేయించుకుంటానని బుజ్జమ్మ దూరపు బంధువులు చెప్పడంతో ఆమెను ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు కలెక్టర్ బుధవారం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి బుజ్జమ్మను పరామర్శించారు. ఆమె కాలికి గాయం తీవ్రంగా ఉందని, మరింత మెరుగైన వైద్య సేవలు అవసరమని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో బుజ్జమ్మను తిరిగి జీజీహెచ్ కు షిఫ్ట్ చేయాలని, పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన చికిత్స అందించాలని, అవసరమైతే హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుజ్జమ్మను వెంటనే నిజామాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

## నూతన పిసిసి ప్రధాన కార్యదర్శి గా రాంభూపాల్

**- క్రమశిక్షణ కమిటీ సభ్యుడు రామకృష్ణ కు ఘనంగా సన్మానం**

**- జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, మోహన్ రెడ్డి, కేశ వేణు లు సూచించారు**




**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25 :**
కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయం లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా పిసిసి ప్రధాన కార్యదర్శి గా నియమిం పబడిన రాంభూపాల్ కు, క్రమశిక్షణ కమిటీ సభ్యుడు రామకృష్ణ ను బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ రెడ్డి,నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కష్టపడ్డ వారిని గుర్తించి పదవులు ఇస్తుందనడానికి ఇది నిదర్శనం అన్నారు. పార్టీ నమ్మకంతో మీకు ఈ పదవులు ఇచ్చిందని, పార్టీ నమ్మకాన్ని కాపాడుతూ పార్టీనీ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసే విధంగా పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా రామ్ భూపాల్, రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మాపై నమ్మకం తో ఈ పదవులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నీ మరింత బలోపేతం చేస్తూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, మాజీ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్, మాజీ కార్పొరేటర్ విజయ,లవంగ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలను నిర్మూలించేది నేటి తరం విద్యార్థులే

**- సిఐ నిరంజన్ రెడ్డి**






**కరీంనగర్ రూరల్ (మన వెలుగు) జూన్ 25 :** మాదకద్రవ్యాల (పదార్థాల) దుర్వినియోగం ప్రపంచవ్యాప్త ముప్పుగా మారిన దాని గురించి చర్చించడానికి మేము ఇక్కడ ఉన్నాము. ప్రపంచంలోని ఏ ప్రాంతం కూడా మాదకద్రవ్యాల శాపం నుండి విముక్తి పొందలేదు. మాదకద్రవ్యాల దుర్వినియోగం తీవ్రమైన ఆందోళనగా ఉద్భవించింది. ఇది దేశం యొక్క భౌతిక మరియు సామాజిక-ఆర్థిక శ్రేయస్సును ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మాదకద్ర వ్యాలు, మనందరికీ తెలిసినట్లుగా, కొంతమంది వ్యక్తులు త్రాగడం, పొగ త్రాగడం, ఇంజెక్ట్ చేయడం లేదా తినడం వల్ల మానసిక మరియు శారీరక ప్రభావాల కోసం ఇది చట్టవిరుద్ధమైన విషయం. వినోదం కోసం లేదా ఇతర కారణాల వల్ల డ్రగ్స్ తీసుకునే అనేక మంది విద్యార్థులు ఉన్నారు. డ్రగ్స్ అమ్మకానికి పాల్పడే వ్యక్తులు ఒక నెట్వర్క్ను సృష్టించి, ప్రధానంగా విద్యార్థులను డ్రగ్స్ క్కు బానిసలుగా మార్చడానికి లక్ష్యంగా చేసుకుంటారు. మొదట్లో విద్యార్థులకు ఉచితంగా డ్రగ్స్ విక్రయిస్తూబి క్రమంగా వాటికి అలవాటు పడ్డాక కొనుక్కొని వినియోగిస్తున్నారు. వాస్తవానికి, విద్యార్థులు కూడా చివరికి వారి నెట్వర్క్లో భాగమై దానిలో వ్యవహరించడం ప్రారంభిస్తారు మరియు ఆల్కహాల్/డ్రగ్ల వ్యసనం పాల్గొన్న వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబం మరియు సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుంది.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా అనేది మాదకద్రవ్యాల నిషేధ చట్టాలకు లోబడి ఉన్న పదార్థాల సాగు, తయారీ, పంపిణీ మరియు అమ్మకాలతో కూడిన ప్రపంచ అక్రమ వ్యాపారం.భారతదేశంలో సాధారణంగా దుర్వినియోగం చేయబడిన డ్రగ్స్:గంజాయి (గంజా): చాలా మంది వ్యక్తులు ఆనందం కోసం మరియు విశ్రాంతి కోసం గంజాయిని ఉపయోగిస్తారు. అయితే ఇది వ్యసనం, భ్రాంతులు, భ్రమలు, ఉపసంహరణ వంటి మానసిక లక్షణాలకు దారి తీస్తుంది, మిమ్మల్ని పిచ్చిగా, చంచలంగా, నిద్రపోలేకపోతుంది మరియు అధిక మోతాదులో, ఇది సైకోసిస్కు కారణమవుతుంది. నేర కార్యకలాపాలు చేయడంలో దారి తీస్తుంది.హెరాయిన్ - దుర్విని యోగం దీర్ఘకాలిక ప్రభావాలు (కాలేయం, మూత్రపిండాలు మరియు ఊపిరితిత్తుల వ్యాధి, మానసిక రుగ్మతల వంటి దీర్ఘకాలిక ప్రభావాలను కలిగిస్తుంది) కొకైన్ - దుర్వినియోగం (హింస, కోపం, అశాంతి, చిరాకు, ఆందోళన, భయాందోళన, మతిస్థిమితం వంటి వాటికి దారితీస్తుంది) ఈ మందు లన్నీ డిప్రెషన్, ప్రవర్తన సమస్యలు, వ్యక్తిత్వ లోపాలు, ఆత్మహత్య ఆలోచనలు, ఆత్మహత్యాయత్నం మరియు ఆత్మహత్య వంటి వ్యక్తులపై తీవ్రమైన ప్రభావాలను చూపుతాయి.మాదకద్రవ్య వ్యసనం శారీరక మరియు మానసిక ఆరోగ్యానికి చాలా నష్టాలను కలిగి ఉంది. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది మరియు ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది. రక్తపోటును పెంచుతుంది మరియు మలబద్ధకం మరియు దంత సమస్యలను కలిగిస్తుంది. దీర్ఘకాలిక మాదకద్రవ్యాల వాడకం గుండె సమస్యలు, నిరాశ, ఆందోళన మరియు ఇతర మానసిక రుగ్మతల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది.మాదకద్రవ్యాల వినియోగం ఈ రోజుల్లో సర్వసాధారణంగా మారింది మరియు చాలా మంది యువత డ్రగ్స్ కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం విషయంలో మన యువతకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. మన యువత జీవితాలను నాశనం చేస్తూ వారి భవిష్యత్తును అంధకారంలో పడేస్తున్నారు. మాదకద్రవ్యాల వినియోగం వారి జీవితాలను దుర్భరంగా మారుస్తుంది మరియు విధ్వంసానికి గురి చేస్తోంది. అందువల్ల, మన యువతలో దీని గురించి అవగాహన పెంచడం మరియు వారు దానికి లొంగిపోకుండా నిరోధించడం చాలా ముఖ్యం. మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 26 న జరుపుకుంటారు, ఇది అవగాహన పెంచడానికి మరియు మాదకద్రవ్య దుర్వినియోగం యొక్క క్లిష్టమైన సమస్యను పరిష్కరించడానికి ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుంది.

అయితే ఈ సంక్షోభంలో మనం నిస్సహాయులం కాదు. విద్య, అవగాహన మరియు మద్దతు మా బలమైన ఆయుధాలు మాదకద్రవ్యాల ప్రమాదాల గురించి మనకు మరియు మన ప్రియమైనవారికి అవగాహన కల్పించడం ద్వారా, అవి తెచ్చే వినాశనాన్ని మనం నిరోధించవచ్చు.మాదకద్రవ్యాల దుర్వినియో గం అందరికీ పూర్తిగా 'కాదు' అని చెప్పడం ద్వారా నేను ముగించాలనుకుంటున్నాను మరియు మా విద్యార్థులు/వ్యక్తులు ఎప్పటికీ డ్రగ్స్ తీసుకోవడానికి ప్రయత్నించరని మరియు దాని వినియోగానికి పూర్తిగా దూరంగా ఉంటారని నేను హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను, ఇది శిక్షార్హమైన నేరానికి దారి తీస్తుంది, మన దేశానికి మీరు అవసరమని గుర్తుంచుకోండి, మీరు దాని భవిష్యత్తు మరియు పురోగతికి దూత మనమందరంకలిసి, మాదకద్రవ్యాల దుర్వినియోగం ఫ్యాషన్ గా మారని భవిష్యత్తును మనం సృష్టించగలము. ఈ పోరాటంలో మనం ఐక్యంగా నిలబడదాం, ఎందుకంటే రక్షించబడిన ప్రతి ప్రాణం జరుపుకోవలసిన విజయం.

## నాడు ప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తే, నేడు అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుంది

**- సిపిఎం నాయకులు బి వెంకట్**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25** నిజామాబాద్ నగరంలోని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాల అయిన సందర్భంగా ఎమర్జెన్సీ నాడు- నేడు అనే అంశం పైన జిల్లా సదస్సును జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం కేంద్ర నాయకులు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ హాజరై మాట్లాడుతూ. 1975లో 25న ఎమర్జెన్సీని నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ప్రకటించి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని ప్రతిపక్షాల నాయకులను, విద్యార్థి నాయకులను, కార్మిక నాయకులను ప్రధానంగా సిపిఎం పార్టీ కార్యకర్తలు అందరిని మీసా చట్టం కింద అరెస్టు చేసి జైలు పాలు చేశారని 18 నెలల పాటు తీవ్ర నిర్బంధం కొనసాగిందని ప్రజాస్వామ్య హక్కులు పూర్తిగా హరించబడ్డాయని ఆయన అన్నారు. నేడు బిజెపి అధికారంలోకి వచ్చిన దశాబ్ద కాలం పైగా ప్రశ్నించే వారిని, నరేంద్ర మోడీని విమర్శించిన వారిని ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి ఆరు నెలలకు పైగా బెయిల్ రాకుండా నిర్బంధంస్తున్నారని. విమర్శించిన వారిని జాతి ద్రోహులుగా ,దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ దాడులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులను పూర్తిగా హరిస్తూ, నియంతృత్వ విధానాలతో ముందుకు పోతున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం తమ చట్టాలను కాపాడుకోవడం కోసం, పేదరికాన్ని తగ్గించాలని, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని దేశంలోని మిగతా అన్ని వర్గాలు ఈ సమ్మెకు ఈ భాగంగా పోరాటాల్లోకి వస్తున్నారని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి ప్రజలందరూ సమైక్యంగా కదిలినప్పుడే నియంతృత్వ విధానాలను నిలువరించగలుగుతామని కొరకు నాటినుండి నేటి వరకు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన సిపిఎం పార్టీ కార్యకర్తలే నిర్బంధాలను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఎన్ని నిర్బంధాలు విధించిన నాడు ఇందిరా నే ఇండియా, ఇండియా నే ఇందిరా అన్న నానుడిని ప్రజలు కాంగ్రెస్ ను ఓడించి జనతా పార్టీని అధికారంలోకి తెచ్చారని. నేడు యుగపురుషుడిగా విశ్వ మానవుడిగా చెప్పుకుంటూ మోడీ జపం చేస్తూ ఉన్నవారికి గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, జంగం గంగాధర్, వేషాల గంగాధర్ నగర కమిటీ సభ్యులు అనసూయ, కటారి రాములు, అనిత నరసయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## 30న యాదవుల ఆత్మగౌర సభను విజయవంతం చేద్దాం

**● బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామ్ చందర్ యాదవ్**



తెలంగాణ ఉద్యమ నాయకుడు బిసి జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవుల ఆత్మగౌరవ సభ ఇందిరాపార్క్ వద్ద ధర్నా గురించి సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో యాదవుల ఆత్మ గౌరవ సభ పోస్టర్ విడుదల పత్రిక విలేకరుల సమావేశం జరిగింది.యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ మహాసభ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్ తో పాటు బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పాల్గొని ప్రసంగించారు.బీసీ జన సభ అధ్యక్షులు రాజారామ్ యాదవ్ పత్రికా విలేకరుల సమావేశంలో అందరినీ స్వాగతం పలుకుతూ యాదవ ఆత్మగౌరవ సభ లో సుధీర్ఘంగా ప్రసంగించడం జరిగింది. బీసీలకు జరిగిన అన్యాయాన్ని ఎకరు పెడుతూ మున్నూరు కాపు యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరడం జరిగింది. అన్ని విధాల బీసీలకు అన్యాయం జరిగిందని సగం పదవులు బీసీలకు ఉండాల్సిన ప్లేస్ లో అగ్రవర్ణాలే ఎక్కువ మంది ఉండడం సూచనీయం యాదవులకు వెంటనే మంత్రివర్గంలో స్థానం కల్పించాలని యాదవుల జనం జనాభా ప్రాతిపదికన మంత్రివర్గంలో స్థానం కల్పిస్తూ ఎమ్మెల్సీ పదవులను నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేప్పుడు 20 పదవులు ఇవ్వాలని కోరడం జరిగింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో గొర్రెల మేకల పంపిణీ కార్యక్రమాన్ని రసాభాస కాకుండా వెంటనే ప్రారంభించి యాదవులకు గొర్రెల పంపిణీ చేయాలని యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పదివేల కోట్లు బడ్జెట్లో కేటాయించి న్యాయం చేయాలని కోరడం జరిగింది .స్థానిక సంస్థల ఎన్నికల్లోను అదేవిధంగా అన్ని రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ వెంటనే జీవో జారీ చేయాలని రాజారాం యాదవ్ కోరడం జరిగింది. బీసీలకు న్యాయం జరిగే వరకూ యాదవులను మున్నూరు కాపు వాళ్లను ఎంబిసి, బీసీ కులాల ను అందరినీ కలుపుకొని ఉద్యమం చేస్తామని ఈనెల 30వ తేదీన ఇందిరాపార్క్ వద్ద రమేష్ యాదవ్ మేకల రాముల యాదవ్ గోవర్ధన్ యాదవ్ మేకల కృష్ణ యాదవ్ బిసి ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో 33 జిల్లాల నుండి బీసీలను ముఖ్యంగా యాదవులను మున్నూరు కాపులను సమీకరించి పదివేల మందితో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఉదయం 11 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ధర్నా నిర్వ హిస్తామని చెప్పడం జరిగింది. బీసీలకు బిసి కుల సంఘాలకు పిలుపునివ్వడం జరిగింది

జాతీయ అధ్యక్షులు మేకల రాములు ప్రసంగిస్తూ... మంత్రివర్గంలో స్థానం కల్పించాలని నామినేటెడ్ పోస్టులు యాదవులకు ఇవ్వాలని గొర్రెల పంపిణీ కార్యక్రమం వెంటనే చేపట్టాలని యాదవ్ కార్పొరేషన్ కు 10000 కోట్లు కేటాయించాలని 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరడం జరిగింది. జాతీయ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్ మాట్లాడుతూ ...యాదవులకు జరిగిన అన్యాయం బీసీలకు జరిగిన అన్యాయం తెలియజేస్తూ మంత్రివర్గంలో యాదవులకు మున్నూరు కాపులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం ఇవ్వని పక్షంలో గుణపాఠం చెప్తామని కాంగ్రెస్ పార్టీ ఒకవేళ బీసీలకు, యాదవులకు అన్యాయం చేస్తే సహించబోమని చెప్పడం జరిగింది. బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ.... బీసీలకు జరిగిన అన్యాయం గత 70 సంవత్సరాల నుంచి తెల్పడం జరిగింది 42% రిజర్వేషన్ స్థానిక ఎన్నికల్లో బీసీలకు కేటాయించాలని కోరడం జరిగింది. విద్యా ఉద్యోగం ఉపాధి అన్నింట 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరడం జరిగింది యాదవులు లేని మంత్రివర్గం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గాని తెలంగాణ రాష్ట్రంలో గాని ఏర్పడలేదు ఈసారి మంత్రివర్గంలో యాదవులు లేని లోటు మీకు తెలియడం లేదా ఒకవేళ మీరు యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా నామినేటెడ్ పోస్టులు న్యాయం చేయకుండా అన్యాయం చేస్తే యాదవులు తిరుగుబాటు చేసి కాంగ్రెస్ ను నామరూపాలు లేకుండా చేస్తారని హెచ్చరించడం జరిగింది. అంజన్ కుమార్ యాదవ్ లాంటి యాదవ నాయకులు పార్టీలు మారకుండా కాంగ్రెస్కు సేవ చేస్తే గుర్తింపు లేదా యాదవులందరూ ముఖ్యంగా బీసీలందరూ ఓటు వేస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవేళ బీసీలకు ముఖ్యంగా యాదవులకు మున్నూరు కాపులకు అన్యాయం చేస్తే మా సత్తా ఏమిటో స్థానిక ఎన్నికల్లో చూపెడతామని రామచంద్ర యాదవ్ హెచ్చరిక చేయడం జరిగింది. 30 జూన్ ఈనెల ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమం సఫలం చేయుటకు బీసీ లందరూ ముఖ్యంగా జేపీసీ, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అందరు పాల్గొనాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ధర్నా లో పాల్గొందామని ముఖ్యంగా యాదవ సమాజం అన్యాయం జరిగింది కాబట్టి దాన్ని సహించక 33 జిల్లాల నుండి పాల్గొని న్యాయం జరిగే వరకూ పోరాటం చేద్దామని ఈ ఉద్యమంలో

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గారిని కలిసి 26ం1 బీసి కులాల అసోసియేషన్ సభ్యులు

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జూన్ 25 :**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద ఈ రోజు 26ం1 ఉపకులాల అసోసియేషన్ సభ్యులు కలిశారు తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం బీసి జాబితా నుండి తొలగించిన 26ం1 ఉప కులాలను మళ్ళీ బీసి జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి బీసీ జాబితాలో చేర్చేలా కృషి చెయ్యాలని ఆ ఉపకులాల అసోసియేషన్ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కోరడం జరిగిందిఅనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు ఈ సమావేశంలో పాల్గొని గత బీఆర్ఎస్ పార్టీ చేసిన అన్యాయాన్ని కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గతో కలిసి ఈ సమస్యలు పట్ల వివరిస్తాం అన్నారుఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 26ం1 ఉప కులాలను బీసీ జాబితా నుండి తొలగించి తీవ్ర అన్యాయం చేసిందాన్నారు2014 నుండి ఆ కులాల కుటుంబల విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో 11 సంవత్సరాలు కోల్పోయిన రిజర్వేషన్ బాధ్యత వహించాల్సింది ఎవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో పెట్టిన ప్రకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీకు ఇచ్చిన మాట నిలపెడుతారని.ఈ సమస్య పట్ల ముఖ్యమంత్రి తో కలిసి మాట్లాడి న్యాయం జరుగేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు అణగారిన వర్గాల ఆపద్బాంధవుడు, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట కోసం బీసీ ప్రజల అభ్యున్నతి కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల, జన గణన చేసిన మొట్టమొదటి నాయకుడు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గుర్తుచేశారు ఈ కార్యక్రమంలో ఉపకుల అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## వెంకటరమణారెడ్డి కి బ్రిక్స్ యూనియన్ సంతాపం



**పినపాక (మన వెలుగు) జూన్ 25 :** అశ్వాపురం : మల్లెల మడుగు గ్రామానికి చెందిన సురకంటి వెంకటరమణారెడ్డి ఇటుక బట్టీల వ్యాపారి ఇటీవల అనారోగ్య కారణంతో అకాలంగా మృతి చెందగా తోటి ఇటుక బట్టీల వ్యాపారులు ఈరోజు బ్రిక్స్ కార్యాలయంలో బుధవారం సంతాప సభ ఏర్పాటు చేసి చిత్రపటానికి పూలమాల వేసి ఘనం గా నివాళులర్పించారు.

అనంతరం వెంకటరమణారెడ్డి తో ఉన్న అనుబంధాన్ని సేవ భావాన్ని ఆయన జ్ఞాపకాలని గుర్తు చేసుకుని పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బ్రిక్స్ యూనియన్ అధ్యక్షులు మర్రి మల్లారెడ్డి,గౌరవ అధ్యక్షులు తలపనేని కొండలరావు గారు బ్రిక్స్ యూనియన్ సభ్యులు ఆకిటి రవీందర్ రెడ్డి గుర్రం రవి,బద్దం వెంకటరెడ్డి,ముద్దం సైదిరెడ్డి, సాదినేని నాగేశ్వరరావు వడ్డేంపూడి రాము, చిగురుపాటి ప్రసాద్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని 1000 పడకలకు పెంచి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 25 :**




నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్- (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వాసుపత్రికి అవుట్ పేషెంట్స్- ఓపి, ఇన్ పేషెంట్-ఐపి పెరిగినందున ఉన్నటువంటి సిబ్బంది మరియు కార్మికులు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీలపై పని భారం పెరిగినందున ఆసుపత్రిని 1000 పడకలకు పెంచి సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరుతున్నాం. కార్మికులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టెండర్ విధానాన్ని రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు హైమది, భాగ్యలక్ష్మి, స్వరూప, భారతి, వెంకటేష్, సాయికిరణ్ మరియు కార్మికులు పాల్గొన్నారు.

## జకోటి ప్లాస్టిక్ కంపెనీలో పని చేసే కార్మికుడికి మేనేజ్మెంట్ కోటాలో 3 లక్షల ఆర్థిక సాయం

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జూన్ 25 :**



కుత్బుల్లాపూర్ జకోటి ప్లాస్టిక్ కంపెనీలో గత రెండున్నర సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్మికుడు మహమ్మద్ మద్దూర్ అలంకు కొన్ని రోజులుగా ఆరోగ్యం క్షీణించడంతో కొన్ని అనివార్య కారణాలవలన కంపెనీ ఏజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారికి ఏం చేయాలో తోచని సమయంలో శ్రమ శక్తి అవార్డు గ్రహీత మదన్ గౌడ్ను ఆశ్రయించగా మదన్ గౌడ్ జకోటి ప్లాస్టిక్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి తమకు ఆర్థిక సాయం అందేలా 3 లక్షల రూపాయలు చెక్ రూపంలో అందించారు వారి కుటుంబం తరఫున శ్రమశక్తి అవార్డు గ్రహీత మదన్ గౌడ్, మద్దతుగా నిలిచిన సిద్ధిక్ , సుభాష్ , రాంబాబు , రేవంత్ కు ధన్యవాదాలు తెలిపారు..